కొళాయి దగ్గిర

—— శ్రీ సత్యదుర్గేశ్వర కవులు ——

(శతావధానులు)

అది బజారువీధి. ఈ కథానికలోని సన్నివేశసమయం ప్రాతఃకాలము. అప్పుడే సూర్యభగవానుడు ముడుచుకుపోయిన ముఖ పద్మాలను చేతులతో విడదీశాడు. మొఖాలు కడిగికొనేవాళ్లు, గోదావరీ స్నానానికి పోయేవాళ్లు, వీధులూడ్చుకొనేవాళ్లు, ముగ్గులుపెట్టేవాళ్లు—ఇల్లాగే ప్రకృతి ధర్మాలతో నిండిఉంది లోకం అంతా.

అదేవేళకు ఎక్కణ్ణుంచో ఓ జట్కావాలా చరాచరావచ్చి మాపాపుకు దగ్గిరగాఉన్న కొళాయి దగ్గిరకుచేరి గుఱ్ఱానికి నీళ్లెట్టు కుంటున్నాడు. అదేసమయంలోనే పొరుగింటి పుల్లమ్మగారి కూతురు లక్ష్మీదేవి 16 ఏళ్లపిల్ల-ఒడ్డూ, పొడుగూ, లావూ అన్నీ అతికినట్టుగా అమర్చబడిన వ్యక్తి-బిందె చేత్తోబుచ్చుకొని నీళ్లకు చక్కావచ్చింది. నేనా పక్కింట్లోనే కాపురముంటూ ఆ సమయానకి వీధిలో అరుగుమీదకూర్చొని బంట్రోతింకాపందుంపుల్ల తేలేదేమా? అని చూస్తున్నాను. సరిగ్గా ఈ దృశ్యం నాకళ్లబడింది. సావకాశంగా పరిశీలించాను. ప్రపంచంగో లింకా యేమీతెలియని ఆ అమ్మాయిదృష్టి ఏదో మోస్తరుభావంతో ఆ జట్కా కుర్రాడిమీద ప్రసరించిందా? అనే అనుమానం తట్టిందినాకు. జట్కా కుర్రాడుగూడా ఎర్రగా, బుర్రగా నిగ్గుదేరిన క్రాపింగుజుట్టూ వగైరాతో డ్రామాయాక్టరులా బాగానే ఉంటాడు. వాడుకూడా ఈపిల్లకేసి ఏదోమోస్తరు వెర్రిచూపు చూచాడనే నానమ్మకం. లేకపోతే ప్రణయప్రళయం ఒప్పే చిరునవ్వు ఇద్దరూ ఒకేసారి నవ్వడం ఏలా సంభవిస్తుందీ అని నాఅనుమానం. ఏమైతే ఎందుకు? అప్పటి ఈ గొడవతప్ప అప్పటికి మరేమీ నాకు విషయాలు తెలియనేలేదు. మరోరెండు గంటలకు ఆ అమ్మాయి తమ్ముడు, ఆ అమ్మాయి ఆబండిమీదే వెళ్లుతూఉండడం చూశాను. అంతే? ఆమధ్యాహ్నం భోజనాని కింటికివచ్చేటప్పటికి మాఆవిడ ఎంతోఆశ్చర్యంగా మొదలెట్టింది చెప్పడానికి.

'ఏమండోయ్! మీకోసంగతి చెప్పతున్నాగాని ఎవరితోటీ చెప్పకండేం? వాళ్లకుతెలిస్తే బాగుండదు' అంది.

నేను:- నువ్వు చెప్పినాసరే? చెప్పకపోయినాసరే? ఆకథా సరళి బాగుండి కొట్లో బేరాలేమీ రాకపోతే సావకాశంగా కూచుండి చిన్నకథగానో, పద్యాలుగానో, నాటకంగానో రాయడంమాత్రం మానను.

మా ఆవిడ:- పేర్లతోటే రాస్తారా ఏమిటి? అప్రదిష్ఠ. ఎవరేనా ఏమనుకుంటారు? అంది మళ్లానూ.

నేను:- ఏమనుకుంటారు? ప్రకృతినే చిత్రిస్తాడండీ! ఎంతగొప్ప వ్యక్తిఅండి! అనుకుంటారు. తెలిసిందా?

మాఆవిడ:- చాల్లెండి! అల్లాఅయితే నేను చెప్పనే చెప్పను. అని మూతి బిగించుకొంది. సరేలే అని కిమన్నాస్తిగా మాటాడకుండా రెండు మెతుకులుతినేసి గదిలో పడుకొన్నాను.

పిల్లల్ని వాళ్లని సర్దుకొని రెండుమెతుకులుతిని ఏదోపనిమీద గదిలోకొచ్చి పెట్టెలుసవరించు కొంటుంది మాఆవిడ. అప్పుడే సమయంఅనుకొని మెల్లిగా కదలేశాను ప్రొద్దుటిగొడవ. 'ఆ అమ్మాయి యిల్లాచేసిందేమిటే?' అని. 'ఆఁ, అవును ఆ అమ్మాయికథే మీతో ప్రొద్దున్న చెప్పాలనుకున్నాను. అప్పుడే మీకుకూడా తెలిసిందీ?' అంది.

'ఆఁ, ఏదో! తెనిసిందిలే. కవినవడంచేత ఒకటేమిటి? అన్నివిషయాలు భావనామాత్రంచేతే ఊహించగలను. అసలు విషయమేమిటేమిటి?' అన్నాను కొంటెతనంగా—

'మీరు కవులుగా ఊహించేశక్తి ఉండగా నన్నడగడం ఎందుకు?' అంది నవ్వుతూ.? అంటే మా ఆవిడ ఆరోక్లాసుదాకా చదువుకుందిలెండి చిన్నప్పుడు; అంచేతే, తండ్రిగారి లౌక్యంకొంత తల్లిగారి అమాయకత్వం కొంత ఆవరించాయి; ఆహేతువువల్లే చెప్పకూడదని అనుకొనిగూడా ప్రసక్తి గూర్చిఅడిగితే చెప్పేస్తుంది. ఇట్టే మళ్లా అందరితోనూ చెప్పదుసుమండీ! యీవన్మంది ఆడాళ్లతోనూ—నాతోనూ, ఇంతే. ఇంకేముందీ మొదలెట్టిందిల్లా—

'మనపొరుగింటి పుల్లమ్మగారి కూతురు లక్ష్మీదేవిమొగుడు పాపం చిన్నతనములోనే పోయాడు. లక్ష్మీదేవిపెరిగి పెద్దదయింది. వాళ్ల నాన్నగారు చదువులో ప్రవేశపెట్టారు. చదువుఅంటే ఆ అమ్మాయి కెంతోయిష్టం కూడాను; రోజూ స్కూలుకు కాలినడకనే వెళ్లి వస్తూఉండేది. కొన్నాళ్లక్రితమే వాళ్ల నాన్నగారు చనిపోయారుగదా? వాళ్లఅమ్మగారు పూర్వాచార పరాయణురాలవడంవల్ల చదువు మాన్పించేసింది. కాని ఆ అమ్మాయిక్లాసులో కల్లా బాగాచదివేదవడం చేత పాపము ఆమేష్టరుగారే వాళ్ల అమ్మనేలాగో ఒప్పించి జీతం వగైరాలన్నీ ఆయనే కట్టుతో మళ్లా చదివించడానికి మొదలుపెట్టించారు. అప్పట్లో రోజూ స్కూలుకు తీసుకొచ్చేందుకు ఓ జట్కాబండినికూడా మాట్లాడి, వాడికి నెలకు ఒకమాటే ఇంతని యిస్తొండే వారుట. సరే క్రమంగా పెళ్లి అయిందో? లేదో? ఇదివరకు తెలియని ఆ అమ్మాయి పడుచుదనం ఆ జట్కాకుర్రాడికి కొంచెం లొంగే సూచన కనిపించినట్లుంది. మెల్లిగా ఏలాగో వాళ్లిద్దరికిగూడా మనము వివాహం చేసుకోవాలనే బుద్ధి పుట్టింది. వాళ్లమ్మకీసంగతి తెలుస్తే శరీరాన్ని కూరతరిగినట్లు తరిగేస్తుంది. అనే భయం ఉంది లోపల—ఇంట్లో చాకిరీ చేస్తూనేఉండేది. స్కూలుకు వెళ్లుతూనే ఉండేది. కాని యిదివరలోకన్న ఇప్పుడు సాయంత్రంవేళ యింటికి రావడంమాత్రం ఆలస్యంగా ఉండేది. ఇదేమే? అని వాళ్ల అమ్మ అడిగితే మేష్టారు ప్రయివేటు చెబుతున్నారే అని మభ్యపెట్టి సర్దుకొనేది. అల్లా సుమారోసంవత్సరంనుంచి జరుగుతోంది కాబోలు. ఈ యేడాది పరీక్ష తప్పింది. దానికోసం వాళ్లమ్మ కోతకోసేస్తూ ఉంది. ఇంక భరించలేక పోయింది కాబోలును. ఈవేళ వాడితోగలిసి లేచిపోయింది. అవునుగాని వెధవముండకు చదువెందుకండి? వాళ్ళమ్మకు బుద్ధిలేదుగాని. వాళ్ళకూ చదువుచెప్పిస్తే గౌరవాలు తగులబడిపోతాయి గాని, ఇంకేమేనా నిలుస్తాయా?'—అని తన సిద్ధాంతాన్నిగూడా చిట్టచివర తేల్చేసింది మా ఆవిడ. 'అదికాదో వెంకాయీ. నువ్వు చిన్నప్పుడు ఎందుకు చదువుకున్నావూ?' అన్నాను నేను.

మా ఆవిడ :-చాల్లెండి. ఆపిల్లకి నాకు సాటితెచ్చారా ఏమిటి?

నేను:-సాటితేవడం కాదు. చదువుకోవడం జ్ఞానంకోసం. జ్ఞానం ఎప్పుడూకూడా ఒక కట్టుబాటులో నడిపిస్తుంది. దానివల్ల గౌరవం, కీర్తి దేశంలో కలుగుతాయి. ఆ అమ్మాయి చదువుకుంది.కనుకనే దేశానికి ఆదర్శంగా ప్రేమను చరితార్థంచేసింది. ప్రేమకు హృదయంలో పొంగే ఉత్సాహంతోనేగాని జాతి మత భేదాలతో నిమిత్తం ఉండదు అనికూడా తేల్చింది. అదీగాక ఈ అమ్మాయి భర్త పెళ్లిఅయిన స్వల్ప కాలంలోనే చనిపోవడంవల్ల, ఆ అమ్మాయికూడా కన్యకలలోకే జమ వస్తుంది గాని వెధవలలోకి రాదు. కాబట్టి సర్వవిధాలా అపభ్రష్టయి పాడైపోకుండా లేచిపోవడంవల్ల మాబోటి కవులు, కథకులు అంతా ఆమె జీవితాన్ని ప్రపంచానికి ఆదర్శప్రాయంగా రాసి, ప్రకృతికి అలంకారంగా, సంఘానికి దోహదంచేస్తూ ఉంటారు. ఏదో చదువుకున్నా లోకజ్ఞానం లేకపోవడంవల్ల మీ సిద్ధాంతాలు అన్నీ ఈలాగే ఉంటూ ఉంటాయి.

మా ఆవిడ:-ఇంక చాల్లెండి. మీ నోరు ఎప్పుడూ నా చదువునుగూర్చే లెక్చర్లిస్తూ ఉంటుంది. అలాంటివారు ఈ లోకజ్ఞానంలేని చదువుకొన్న పెళ్లాం వద్దని ఆనాడే చెప్పేయలేక పోయారా? మంచి లోకజ్ఞానం వుండే పెళ్లాం వచ్చేది—అంటూ కపటంగా అభినయిస్తూ రెండుమార్లు ఎత్తిపొడిచి కుర్రాడు లేచి ఏడుస్తూవుంటే చక్కా వెళ్లిపోయింది. సరే, నేనుగూడా షాపుకు పోదామని దప్పా దవాలూ తగుల్చుకొని బతాలుదేరాను; దారిలో ఆలోచించుకొంటూ స్టోరీ ఏలా మొదలుపెడితే బ్భాగుంటుందా? అని. ఇంతట్లోకే నా చిరకాల స్నేహితుడు రామారావు కనుపించాడు దారిలో—

'ఏమిరోయి! బహుకాలదర్శనం. ఎక్కడుంటున్నావేమిటిప్పుడు?' అన్నాను.

వాడు:-ఎక్కడేమిటి ఈమధ్య సుమారోసంవత్సరం దగ్గిర్నుంచీ ప్రపంచంలోనే వుంటూవుంట ఒకచోటా? ఒకదేశమా? దేశాలన్నీ తిరుగుతున్నాను—అన్నాడు.

నేను:-అదేమిటోయి? సాధువుగారికి మల్లే చెబుతున్నావ్?

వాడు:-అసలుకథ విను మరి చెబుతాను. నేను బెజవాడలో చెరుకుపల్లి జమీందారుగారి దగ్గిర వుద్యోగం చేస్తున్నాను. వాళ్ల మేనల్లుడీమధ్యే అంతా ఓసంవత్సరం సుమారవుతుందిలే?-ఇంట్లో అత్తగారేదో అందని ఎవళ్లతోటీ చెప్పకుండా బిచాణా ఎత్తేశాడు. జమీందారుగారికి ఆ కుర్రాడంటే పంచప్రాణాలూను. తనకున్న ఒక్కకూతుర్ని వాడికిచ్చి పెండ్లిచెయ్యాలనికూడా వుత్సాహపడుతున్నాడు. ఇంతట్లోకే వాడికేమి తోచిందో, లేచి చక్కాపోయాడు. ఎక్కడున్నా వెతికి తీసుకురావాలని చెప్పి నన్నూ ఇంకా కొందర్ని తలోచోటకూ పంపించాడు మా జమీందారుగారు. వెతగ్గా వెతగ్గా కొవ్వూర్లో ఒకాయన చెప్పేడు. 'ఈ వూళ్లో జట్కాబండి తోలుకుంటున్నా'డని సరే, అనిచెప్పి ఈవూరు వచ్చాను—అన్నాడు.

నేను:-ఈ వూళ్లో జట్కాబండి తోలుకుంటూ ఒక విలక్షణరూపంగల కుర్రాడయితే వున్నాడు కాని, వాడి తాలూకు ఫోటో ఏమైనా వుందా నీదగ్గిర—అన్నాను. ఉందని చూపించాడు. బాగా పరిశీలించాను. నేను ప్రొద్దున్నచూచిన విగ్రహానికి దీనికి ఏమీ భేదం కనిపించలేదు నాకు. 'సరే ఈకుర్రాడయితే ఈవూళ్లో ఉన్నాడు కాని ఇవ్వాళ ప్రొద్దున్నే ఒక విధవ అమ్మాయిని తీసుకొని లేచిపోయాడురా' అని మెల్లిగా జారవిడచాను మాట.

వాడు ఆలోచిస్తూ 'సరే. ఆ అమ్మాయి తాలూకువాళ్లెవళ్లైనా ఉన్నారా? ఈవూళ్లో' అన్నాడు.

'లేకేం? అమ్మాయితల్లీవాళ్లూ ఉన్నారు. మా యింటిపక్కదే కూడ వాళ్లిల్లు'

వాడు:-ఉహుఁ;

నేను:-అయితే, ఈ జమీందారుగారికులమేమిటిరా?

వాడు:-బ్రాహ్మణాళ్లేనోయ్. వీళ్లెల్లాగైనా పట్టుకొని తీసుకుపోవాలిరా. లేకపోతే మాజమీందారుగారు నుయ్యో, గొయ్యోఁ చూచుకుంటాడు. అంతతో మాకూట్లో దుమ్ముపడుతుందికూడాను.

తిన్నగా మాయింటికివెళ్లేము. నన్ను వదలిపెట్టి వాడుతిన్నగా పుల్లమ్మగారింటికివెళ్లి మళ్లా పది నిముషాల్లోవచ్చి, 'ఒరేయి, వంటా పెంటా చేయించకు. మళ్లావచ్చినప్పుడు భోంచేసిపోతానుగాని ఆసుబ్రాడు ఆ అమ్మాయి కలిసి వాళ్లమేష్టరుతో కాకినాడ వెళ్లారుట. వాళ్ల మేష్టరేమో యింటికి కబురుచేసారుట. అక్కడ ఇద్దరికీ పెళ్లిచేస్తారట రేపో మాపో?' అంటూనే బిచాణా చేత్తోపట్టుకుని 6 గంటల డీసెల్ కారకు బయలుదేరాడు. 'ఒరేయి, సంగతేంజరిగిందో వుత్తరంరాయరోయ్' అన్నాను జట్కాలోవాడు వెళ్లుతుంటే—

రెండురోజులకి నామిత్రుడిదగ్గిర్నుంచి నాకీక్రింది యుత్తరంవచ్చింది.

"క్షేమము ప్రియమిత్రుడికి రామారావు వ్రాయునది—

నిన్న తెల్లవారేసరికి కాకినాడనుంచి మేష్టారుతోగూడా అమ్మాయిని అబ్బాయినీగూడా బెజవాడ చేర్చాను. అందరి ప్రాణాలూ ఆత్మల్లోకి చేరేయి. కాని, మొదట్లోని మీవూరి అమ్మాయిని ప్రేమించిన వరుణ్ణి మా జమీందారుగారి కూతురు ప్రేమించినా, కడవలునిండేలాగు కన్నీరుకార్చినా, (అతడింట్లోంచి లేచిపోయాడని లే) పెళ్లిచేసుకుంటుందా? అని అనుమానించాను. కాని ఆలాంటి వుపద్రవాలేమీ లేకుండానే పీర్లుగుండాన్ని బడ్డాయి. మేష్టరుగారు పెట్టిన ముహూర్తాన్నే ఇద్దరూకూడా అతణ్ణే పెండ్లిచేసుకోడానికి ఒప్పుకున్నారు. చేసుకొంటున్నారుగూడా. ఇంతకీ సుబ్రాడదృష్టవంతుడోయి—మరి నేను దిగఢతాను.

రామారావు"

ఈ వుత్తరాన్ని చదువుకొని మళ్లా ఒక్కమారు ఆనాటి కొళాయిదగ్గిర దృశ్యాన్ని ఆత్మలో అవగతంచేసుకున్నాను. నిశ్చలప్రేమను గౌరవస్వాతంత్ర్యంతో మేళగింపజేసిన ఆ అమ్మాయి దేశానికి ఆదర్శప్రాయమయింది అని సంతోషించాను. సంతోషించడమే కాదు. నా సంతోషమే మొన్నవచ్చిన గోదావరీ నదిలా పొంగి ఈ వ్యాసమనే గట్టును తెగ్గొట్టి ప్రవహించింది హాయిగా; ఆ సంతోషాన్నే మీ అందరికీకూడా పంచిపెడుతున్నాను.

న జాతు కామః కామానాముపభోగేన శామ్యతి,
హవిషాకృష్ణవర్త్మేవ భూయ ఏవాభివర్ధతే.

ఇంద్రియజయముచే నేమి లాభము కలదు. విషయసుఖము లనుభవించుటచేతనే యింద్రియములు తనివి నొందును అని శంకించి సమాధానము చెప్పబడుచున్నది—కామము (కోరిక) విషయాభిలాషముచేత నెప్పటికిని దనియదు. ఆజ్యాహుతిచే నగ్నిహోత్రుఁడు ప్రవర్ధిల్లినట్లు మఱిమఱి వృద్ధినొందుచునే యుండును.

—మనుధర్మశాస్త్రము.